# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలని వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

2. **తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026" నిర్వహించనున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**

3. **రాజధాని అమరావతిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 15 వందల 48 కోట్ల రూపాయల ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

4. **ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.**

==========================

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం, పొలాకి, సంతబొమ్మాళి మండలాల మధ్య అర్ధరాత్రి తీరం తాకిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. తీరం దాటినప్పటికీ, వాయుగుండం భూభాగంపై తీవ్ర వాయుగుండంగానే కొనసాగుతోందని తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాల పరిస్థితిపై అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు కె.నాగరత్న తెలియజేస్తూ,

వాయిస్ ..25..సెకన్లు

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ రోజు, రేపు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

-------------------------

తీవ్ర వాయుగుండం ప్రభావంతో వివిధ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లతో శ్రవణ మాధ్యమం ద్వారా గత రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా

ఉండాలని ఆదేశించారు. వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేసి, క్షేత్రస్థాయి వరకు అవసరమైన సూచనలు జారీ చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా నష్టపోయిన పంట విస్తీర్ణాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఈరోజు కూడా సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

------------------------------

తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

------------------------------

తుఫాను తీరం దాటిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, అధికారుల సూచనలు తప్పక పాటించాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు విజయనగరం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సముద్రంలో ప్రమాద హెచ్చరికలు తొలగించే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మంత్రి సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

------------------------------

రాజధాని అమరావతిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 15 వందల 48 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతి మంజూరుచేసే ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం పోర్టులో గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌కు 400 ఎకరాలు కేటాయింపుకు రాష్ట్రంలో మౌలిక వసతులు-పెట్టుబడులు, పరిశ్రమలు-వాణిజ్యం, ఇంధన, ఆహారశుద్ధి, పర్యాటక రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనల్ని మంత్రిమండలి ఆమోదించిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

------------------------------

తెలంగాణకు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026" నిర్వహించనున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో సదస్సు ఏర్పాట్లు, ప్రచారం,

రోడ్‌షోల నిర్వహణపై కార్యాచరణను ఖరారు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో అవకతవకలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ విజయవాడలోని లోక్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే, శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి జరిగినట్లు ఆరోపిస్తున్న విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి చెందిన 459 ల్యాండ్ పార్శిళ్ల ఈ–వేలంపై నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్–ఎన్ఎల్ఎంసీ నిన్న విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్ఎల్ఎంసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీఈఓ రోహన్ చంద్ ఠాకూర్, ఆర్ఐఎన్ఎల్ సీఎండీ ఎం.ఎన్.వి.ఎస్. ప్రభాకర్ ప్లాట్ల వివరాలు, బిడ్డింగ్ అర్హత ప్రమాణాలు, రిజిస్ట్రేషన్ విధానం, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ), ఈ–వేలానికి సంబంధించిన ఇతర నిబంధనలను వివరించారు. ఈ–వేలం అక్టోబర్ 12, 16 తేదీల్లో రెండు విడతలుగా నిర్వహించనున్నారు. ప్రతి వేలానికి ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ –ఈఎండీగా రెండు లక్షల రూపాయలు నిర్ణయించారు. ఈ–వేలానికి ముందు నిర్వహించే పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు విజయవాడలో, రేపు హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

జాతీయ పోషణ్ మాసోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ ఛాయా చిత్ర ప్రదర్శనను శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీబీసీ డైరెక్టర్ జి. సురేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ చంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

======================